# కల కాదు.. నల్లమల!



కొల్లాపూర్ సమీపంలో నల్లమల అటవీ సౌందర్యం

**చరిత్ర పాఠాలు చెప్పే శాసనాలు, ప్రకృతి సౌందర్యాన్ని పరిచయం చేసే వాగులూ వంకలు, కృష్ణా తీరం వెంబడి ఆధ్యాత్మిక క్షేత్రాలు, దట్టమైన అడవిలో వన్యప్రాణుల సందళ్లు.. మొత్తంగా నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అటవీ ప్రాంత అందాన్ని ఆస్వాదించాల్సిందే. అనేక అనుభూతులను మూటగట్టుకుని తిరిగొస్తాం. మరొక్కసారి వెళ్లాలనీ తీర్మానిస్తాం.**

ఊటీ వరకూ వెళ్లలేనివారికి, కొడైకెనాల్ కోరిక తీరనివారికి సూక్ష్మంలోనే పర్యాటక మోక్షం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అటవీ ప్రాంతం. జటప్రోలు, సోమశిల, మంచాలకట్ట, అమరగిరి పరిసరాల్లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తాయి. పొరుగున ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రాలూ ఆకట్టుకుంటాయి. అందుకే, ఈ సీజన్‌లో ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు తరలివస్తారు. మంచాలకట్ట దగ్గర కృష్ణానది అలల తాకిడి ఆనందానుభూతులను పంచుతుంది. నల్లమలలో మయూరాల నాట్యాలు, లేడి కూనల పరుగులు, రకరకాల పక్షుల కువకువలు, పులుల గాండ్రిపులు.. ప్రత్యక్షంగా అనుభూతి చెందాల్సిందే. సప్తనదుల సంగమంలోని అమరగిరి ప్రాంతం ముందు.. ఊటీ దిగదుడుపే. కొల్లాపూర్ నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అమరగిరికి వెళ్తున్నప్పుడు దారి పొడవునా పచ్చని చెట్లు, వంపులు తిరిగిన రోడ్డు, ఎత్తయిన కొండలు, పాతాళానికి దారిచూపేలా ఉన్న లోయలు కట్టిపడేస్తాయి. సీతాకోక చిలుకలు సాదర స్వాగతం పలుకుతాయి. అమరగిరి నుంచి అరగంట బోటులో ప్రయాణిస్తే మల్లయ్య సెల వస్తుంది. ఇక్కడి సెలయేటి పరుగులు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. అమరగిరి నుంచి బోటులో రెండు గంటలు (8 కిలోమీటర్లు) ప్రయాణిస్తే చీమలతిప్ప ద్వీపానికి చేరుకోవచ్చు. అంకాలమ్మ కోట కొండపై నుంచి ప్రకృతి అందాలు తిలకించడం ఓ మంచి అనుభవం. చీమలతిప్ప ద్వీపం వద్ద విశాఖపట్నం జాలర్లు తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకొని కృష్ణానదిలో చేపల వేట కొనసాగిస్తారు. ద్వీపం చుట్టూ లంగరు వేసిన మరబోట్లు, నాటు పడవలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. కొత్త అనుభూతుల్ని పంచుతాయి.



కృష్ణా తీరంలో ఉన్న అంకాలమ్మ కోట.. కోటపై అంకాలమ్మ దేవత

